# తప్పు




**కథ చదవడం పూర్తి చేసి కాగితాలు టేబిలుమీద ఉంచాను. 'పేపరు చదువుట' నటించడం మానేసి, తగుమాత్రం తప్ప తక్కిన కుతూహలం దాచేసుకుని, ఏం చెబుతానా అని తలెత్తి చూశాడు మురళి.**

మురళి ఈమధ్యనే కథలురాయడం మొదలు పెట్టాడు. అతనికి రాద్దామన్న కోరికా, కొద్దో గొప్పో రాయగలనన్న నమ్మకమూ ఎప్పణ్నుంచో ఉన్నాయి. కలం పుచ్చుకున్నది మాత్రం నా వల్లే.

"బావుంది కథ!" అని ఆగి-

"బావుంది కానీ, పెద్దతప్పు వదిలిపెట్టి చిన్న తప్పుని ఎత్తి చూపావే?" అన్నాను.

ఆ సమయానికి కృష్ణమూర్తి మా గదిలోకి అడుగుపెట్టాడు. పెడుతూనే, "పెద్దతప్పేమిటి? చిన్నతప్పేమిటి? ఏమిటి కథ గురూ!" అని అడిగేడు.

"కథే!" అన్నాను.

కృష్ణమూర్తికి కూడా కథన కుతూహలం ఉంది. మురళిలాగే కథారచనలో ఒకరకంగా నాకు శిష్యుడు.

టేబిలుమీద కాగితాలు తీసుకుని, "మురళి రాశాడు కదా!" అన్నాడు కృష్ణమూర్తి. "నన్ను కూడా చదవనీ! తర్వాత నీ విశ్లేషణ చెబుదువుగాని!" అని సర్దుకుని కూచున్నాడు.

* * *"

వాణీ, విజ్జీ ఇద్దరూ నెమ్మదిగా ఇంటికెళ్లారు. ఇంటి వెనకాల కాంపౌండ్ వాల్ బయట ఒక ఎర్రపూలచెట్టు ఉంటుందమ్మా! అక్కడ కూచున్నారుట. ఇద్దరికీ భయంగా ఉంది. ఇంట్లో తిడతారు కదా! నెమ్మదిగా ప్రోగ్రెస్ రిపోర్టు బయటికి తీసి మళ్లీ చూసుకుందిట విజ్జీ. విజ్జీ అంటే అక్క అన్నమాట. చెప్పాను కదా అక్కా చెల్లెలు ఇద్దరూ మా క్లాసే. ఐదోతరగతే! అస్సలు సరిగా చదవరు.

"కూర నేను అడగలేదమ్మా! అన్నయ్య

అడిగాడు.''

"వాళ్లకి ఓ కుక్క ఉందమ్మా! చిన్నపిల్ల. అది అక్కడికి వచ్చిందిట. చెట్టుకిందకి. అది కనిపిస్తే చాలు దాంతోఎంతో హుషారుగా ఆడుకుంటారుట. తను చెప్పింది - విజ్జీ. కానీ వాళ్లకి మార్కులు దరిద్రంగా వచ్చాయని భయంగా ఉంది కదా! దాంతో ఆడుకోవాలనిపించలేదుట. ఎర్రపూలు కొన్ని రాలిపోయి ఉన్నాయిట. వాటిని ఏరుకోవాలని కూడా అనిపించలేదుట. ఊరికే అలా కూచున్నారుట చాలాసేపు.

"ఆ రిపోర్టులు చూస్తే టీచర్లు తిట్టిన తిట్లు, కొట్టిన దెబ్బలు -సైన్సు టీచరు కొట్టారులే. యాభైకి ఆరే వచ్చాయి మరి-అన్నీ గుర్తుకొస్తున్నాయిట.

"అలా భయంగా కూచున్నారుట. మార్కులు తక్కువొస్తే ఇంట్లో తిడతారు. వాళ్ల పెదనాన్నగారూ, నాయనమ్మా ఇద్దరూ తిడతారుట.

"వాళ్లమ్మగారు ఇక్కడుండరు. సౌదీ వెళ్లారుట. అక్కడ ఉంటారు. బాగా డబ్బులు సంపాదించుకోవచ్చని వెళ్లారుట. వాళ్ల నాన్నగారు కూడా ఇక్కడ ఉండరు. ఆయనకి బొంబాయిలో ఉద్యోగం. వీళ్లు వాళ్ల పెదనాన్నగారింట్లో ఉంటున్నారు. ఆ పెదనాన్నగారికి వాణీ అన్నా, విజ్జీ అన్నా చాలా ఇష్టం. గారమే కానీ ఎప్పుడన్నా కోపం వస్తే చీరేస్తారుట.

"ఆవకాయ వద్దమ్మా! మళ్లీ కూరే వెయ్యి."

"ఏం? చెట్టుకింద కూచుని, ఆ మార్కులకేసి చూళ్లేక ... ఏం చూస్తారమ్మా నాలుగులూ ఆరులూను. పదిలోపే ...విజ్జీ రిపోర్టులు బేగ్‌లో దాచెయ్యబోయిందిట. దాచెయ్యబోతే వాణీకి ఒక ఐడియా వచ్చిందిట. "విజ్జీ! ఇలా ఇవ్వే!" అని రిపోర్టులు లాక్కుని పెన్ను తీసుకుని మార్కులు దిద్దెయటం మొదలుపెట్టింది. ఆరుని ముప్పయ్యారు చేసేశారు. నాలుగుని నలభైనాలుగు చేసేశారు. ఇలా ఇద్దరూ కలిసి దిద్దేసే ఇంట్లోకి వెళ్లిపోయారుట.

"వాళ్ల పెదనాన్నగారు ఊళ్లో లేరుట. కానీ స్కూల్లోటీచరు అడిగేస్తారు కదా! సంతకాలు చేయించుకుని వచ్చి రిపోర్టులు ఇచ్చెయ్యాలి కదా!

"ప్లీజ్ ... అన్నయ్యా! అటు జరగవా! నాకు కొవ్వొత్తి వెలుగు రావట్లేదు. చాలు, చాలు."

"మా పెదనాన్నగారు ఊరినుంచి రాలేదు అని చెప్పారు రెండురోజులు. మూడోరోజున కూడా అలాగే చెపితే టీచరు తిడతారని భయంగా ఉంది వాళ్లకి.

"దిద్దడం దిద్దేశారు గాని వాళ్ల పెదనాన్నగారు ఊరి నుంచి వచ్చినా చూపించలేదు. రిపోర్టులు చూస్తే దిద్దినట్టు చక్కగా తెలిసిపోతుందిట. అందుకని టీచరింకా రిపోర్టులివ్వలేదని అసలు పేపర్లే దిద్దలేదని ఇంట్లో చెప్పారుట.

"సంతకం లేకుండా ఎలా ఇవ్వాలి? మార్కులు దిద్దినట్టు టీచరు చూస్తే ఉతికేస్తారు. మా క్లాస్ టీచరెలా కొడతారో తెలుసా? గ....ట్టిగా తగు ల్తుంది. చా...లా గట్టిగా. కొడుతున్నప్పుడు చూస్తే ... పక్కవాణ్ని కొడుతున్నా సరే ... మనకి వణుకు ఒచ్చేస్తుంది. అంత భయంకరంగా కొడతారు.

"టీచర్‌కి ఏదో ఒకటి చెప్పాలి కదా! అందుకని 'రిపోర్టులు పోయాయి, టీచర్!'' అని చెప్పింది వాణీ. విజ్జీ కూడా ధైర్యం తెచ్చుకుని, "అవును, టీచర్! కొత్త రిపోర్టులు ఆఫీసులో కొని రేపు తెచ్చిస్తాం టీచర్!'' అంది.

"టీచర్ ఏమంటారోనని మాకు భయం వేసింది. వాణీవాళ్లు నా క్లోజ్ ఫ్రెండ్సమ్మా! చదవరు గానీ, చాలా మంచివాళ్లు. విజ్జీ బొమ్మలెంత బాగా వేస్తుందో తెలుసా? వాణీకి మార్కులు రావు గాని ఎన్ని విషయాలు తెలుసో? జనరల్ నాలెడ్జి బాగా ఉంది.

"టీచరెందుకో ఏమీ అన్లేదు. ఇంతలో ఏమయిందో తెలుసా? మా క్లాసులో దీప్తి అని ఒక పిల్ల ఉంటుందీ ... ఎవర్నన్నా టీచరు తిడుతుంటే తనకి ఎంత సంతోషమో... ఆ పిల్ల లేచి, "టీచర్! టీచర్! అబద్ధం టీచర్! రిపోర్టులు బాగ్‌లోనే ఉన్నాయి, టీచర్!'' అని చెప్పేసింది. ఎప్పుడో దొంగచాటుగా చూసేసిందన్నమాట.

"టీచరు చూశారు. ఇంకేవుందీ? మార్కులు దిద్దేసి ఉన్నాయి. కొట్టారు చూడూ కర్ర విరిగి పోయింది. విజ్జీ చేతి నుంచి కొంచెం రక్తం కూడా వచ్చింది. వాణీ మొహం ఎర్రగా కందిపోయింది. ఇద్దరూ ఏడుపు...ఏడుపు. క్లాసంతా బిగ్గిసి పోయింది.


"మీ పని ఇలా కాదు, హెడ్‌మిస్ట్రెస్ గారికి చెబుతా!'' అనీ రిపోర్టులు తీసుకుని కోపంగా వెళ్లిపోయారు టీచరు.

"ఇదంతా నిన్న జరిగిందమ్మా! ఇవాళ వాణీ వాళ్ల నాన్నగారు మా స్కూలుకి వచ్చారమ్మా! ఆయన బొంబాయి నుంచి నిన్న రాత్రి వచ్చారుట. వాళ్ల స్థలం ఏదో అమ్మెయ్యాల్సివచ్చిందిట. అందుకని ఆయనకు అసలే చిరాగ్గా ఉందిట. పొద్దన్న - మా స్కూల్లో గంట కొడతాడు చూడు సుబ్బయ్య అని - అతను వెళ్లి మీ పిల్లలు ప్రోగ్రెసురిపోర్టులు దిద్దేశారంటండి, మా హెడ్‌మిస్ట్రెస్‌గారు మిమ్మల్నో సారి రమ్మన్నారండి అని చెప్పాడు. వాళ్ల డాడీ తిట్టారుట...స్కూలు టైము అయిందని స్కూటరు తీశారుట, పిల్లల్ని దింపుదామని. సుబ్బయ్య అప్పుడు చెప్పేట్ట. దారంతా తిట్టుకుంటూ కసురుకుంటూ తీసుకొచ్చారుట.

"చారు కావాలమ్మా! అన్నం వద్దు."

"ఏం? స్కూటరు దింపి స్కూలు గేటుదాకా ఈడ్చుకుంటూ వెళ్లిపోయారు ఇద్దర్నీ రెక్కలుచ్చుకుని. అందరూ చూస్తున్నారు. నాకు ఎంత బాధేసిందో. ఏడుపొచ్చేసిందమ్మా! వాణీకి, విజ్జీకి భయం. కళ్లమ్మటా నీళ్లు కారిపోతున్నాయి.

'హెడ్‌మిస్ట్రెస్‌గారు బాగా కేకలేశారుట. విజ్జీవాళ్ల నాన్నగారు మళ్లీ తిట్టారుట. తిట్టి ఇంటికి వచ్చారంటే చంపి అవతల పారేస్తానని కేకలేసి వెళ్లిపోయారు.



**ఉన్నవి అంతే!**

"రెండు కళ్లూ లేనోడిని బాబయ్యా! ధర్మం సెయ్యండి, బాబయ్యా!" ఓ బిచ్చగాడు అరిచాడు.

"ఎలా కుదురుతుంది? నాకున్నవి రెండే కళ్లు కదా!" సీరియస్‌గా జవాబిచ్చి వెళ్లిపోయాడు మురళి.

- పి. సురేష్‌కుమార్

"క్లాసులో చూడాలమ్మా! ఒక్కో టీచరూ రావడం, తిట్టడం ఇంకెప్పుడూ ఇలా చెయ్యకండేం అని చెప్పడం. చాలామంది మా క్లాసుపిల్లలు వాళ్లతో మాటాడలేదు ముందు.

"వాణీ, విజ్జీ ఇవాళ పొద్దుట్నుంచీ ఏమీ తినలేదు తెలుసా! ఇంటికెళ్లాలంటే భయం కదా! లంచ్ టైములో కూడా స్కూల్లోనే ఉండిపోయారు. అందరూ తింటుంటే ఊరికేకూర్చోవాలంటే ఎంత బాధగా ఉంటుందో కదమ్మీ! నాకు నువ్వు ఏమన్నా కొనుక్కోమని రూపాయి ఇచ్చావు కదా దాంతో మూడు చాక్లెట్లొచ్చాయి. ఇద్దరికీ చెరొకటి ఇచ్చాను. నేనొకటి తిన్నాను.

"ఒకమ్మాయేమో-మూడుగిన్నెల కేరేజి తెచ్చుకుంటుంది. ఒక గిన్నెవాళ్లకి చ్చేసింది. ఇంకో అమ్మాయి రెండు ఇడ్లీలిచ్చింది.

"సాయంత్రం స్కూలు వదిలాక ఇంటికెళ్లం అన్నారు. అక్కడే ఉండిపోతాం అన్నారు బిక్కమొహాలు పెట్టుకుని. మేం కొంతమంది ఫ్రెండ్సుమి ఎవరింటికి తీసుకెళ్లమా అని ఆలోచిస్తున్నాం. ఎందుకు తీసుకొచ్చావు అని పెద్దవాళ్లు తిడతారేమోనని భయంగా ఉంది మాకు.

"మా క్లాసుటీచరు మమ్మల్ని చూశారు. ఆవిడ రిక్షాకోసం చూస్తున్నారు. మమ్మల్ని దగ్గిరికి పిలిచారు. ఇంకా ఇక్కడే ఉన్నారేమిటి అన్నారు. ఒకమ్మాయి చెప్పింది ఇలా ఇంటికి వెళ్లనంటున్నారని.

"తను వాళ్ల అమ్మ దగ్గిరికి వెళ్లిపోతాదంట టీచర్! మధ్యాహ్నం ఏడ్చుకుంటూ వాళ్ల మమ్మీకి వాణీ ఒక లెటర్రాసింది టీచర్!" అని చెప్పింది సౌభాగ్య.

"నన్ను పోస్ట్‌డబ్బాలో వెయ్యమంది టీచర్!" అని లలిత ఉత్తరం తీసి టీచర్‌కిచ్చింది. టీచరు చదివారు. అందులో ఏం రాసుందో తెలుసామ్మా!

"మమ్మీ! నువ్వు తొందరగా వచ్చెయి మమ్మీ! ఇక్కడ ఏమీ బాగాలేదు. అందరూ మమ్మల్ని తిడుతున్నారు. క్లాసు టీచరయితే ఎంతగట్టిగా కొట్టారో. నాకు చెయ్యి నొప్పిగా ఉంది. ప్రోగ్రెస్ రిపోర్టు చూసి నాన్న అక్కనీ, నన్నూ బాగా తిట్టారు. ఈవేళ నేను అన్నం తినలేదమ్మా! మా ఫ్రెండ్స్ పెట్టారు కానీ తినాలనిపించలేదు. ఇంటికొస్తే చంపేస్తానన్నారు నాన్న. ఎలా వెళ్లం? నాకు చచ్చిపోవాలని ఉంది మమ్మీ! నువ్వొచ్చెయ్యి!" ఇలా రాసిందమ్మా! నాకు ఏడుపొచ్చేసింది.

"మా క్లాస్‌టీచరుకి కూడా ఏడుపొచ్చింది. చదివాక కళ్లు మెరిశాయి, నీళ్లొస్తే మెరుస్తాయి చూడు అలాగ. పక్కకి తిరిగి కళ్లు తుడిచేసుకున్నారు.

"నేను ఇంటిదగ్గిర దింపుతాను రండి, భయం లేదు!" అన్నారు. "ఒక్క తప్పుచేస్తే ఎంత శిక్ష అనుభవించాల్సి వస్తుందో చూ శారా?" అని చెప్పి తన. కూడా తీసుకెళ్లారు రిక్షాలో.

* * *

కాగితాలు పక్కన పెట్టి, "ఇప్పుడు చెప్పు, పెద్ద తప్పేమిటి, చిన్న తప్పేమిటి?" అని అడిగాడు కృష్ణమూర్తి.

"నీ కామెంట్ చెప్పు, ముందు!" అన్నాను నేను.

"నువ్వు చెప్పవయ్యా! నేను చెప్పడానికేవుందీ ... ఇది మామూలు కథలా లేదు. సస్పెన్సు లేదు. బిగి లేదు. పిల్లచేత కథ చెప్పించటంవల్ల కొంచెం వెరయిటీ ఉంది. అసలు చిన్నపిల్లలికి చెప్పే నీతి కథలా ఉంది. అయితే ఒకటి - ఇంత కుముందు రాసిన కథలకన్నా దీంట్లో మనవాడి రచన కొంత మెరుగ్గా ఉంది. ఇక నువ్వు కానీ ...!" అన్నాడు కృష్ణమూర్తి.

నేను ప్రారంభించాను "కథపేరు 'తప్పు'. కథ చివర్లో 'తప్పు చేస్తే శిక్ష అనుభవించాల్సి వస్తుంది కాబట్టి ఎప్పుడూ తప్పు చెయ్యకూడదు' అంటుంది టీచరు. అవునా? పిల్లలు చేసింది చిన్న తప్పు అని నేనంటున్నాను. పెద్ద తప్పు వేరే ఉంది. అసలు పిల్లలిది తప్పే కాదు, ఒకరకంగా."

"నిజానికి ఇది చిన్న పిల్లల కథ కాదు. పెద్దవాళ్ల కథ. పిల్లలు తప్పు చేశారని మురళి అంటున్నాడు. పిల్లలచేత తప్పు చేయించారని నాకనిపిస్తోంది.

"జీవితం ఎంత శిక్షగా ఉంటోందో, దాన్ని మన మంతా ఎంత భయంకరంగా తయారుచేశామో ఈ సంఘటన చెబుతోంది.

"మార్కులు దిద్దేశారు పిల్లలు. ఎందుకు? తక్కువొచ్చాయని. అందరికీ స్కూల్లో చెప్పే నాలుగు పాఠాలూ వచ్చితీరాలనీ, విధిగా మంచిమార్కులు వచ్చి తీరాలనీ, రానివాళ్లందరూ దద్దమ్మలనీ, ఎందుకూ పనికిరాకుండా పోతారనీ నువ్వో, నేనో, మనమందరమూనో ఒక రాక్షసకంఠస్వరంతో పసిపిల్లల గుండెల్లో అరుస్తూ వచ్చాం. అందరికీ అదే చదువు వాళ్ల అభిరుచుల్తో, నైపుణ్యాల్తో నిమిత్తం లేకుండా నచ్చాలని మన శాసనం.

"అంత అరుచిగా ఉన్న చదువుని ఇష్టపడటం ఎలాగో వాళ్లకి తెలియదు. పిల్లలకి రుచికరమైన చదువు చెప్పాలని మేధావులకి పట్టదు.

"మనం చదువు అనుకునే చదువుఉందే, అది రాని పిల్లలందర్నీ కించపరచడం, అవమానపరచడం నేర్చుకున్నాం. చదువునీ, చదువొచ్చినవాళ్లనీ ద్వేషించక తప్పని పరిస్థితి చదువురాని పిల్లలకు కల్పించాం.

"మార్కులు దిద్దేశారు. అందుకుగాను నాలుగురోజులు క్షోభ అనుభవించారు. నీకూ నాకూ ఇది చిన్న విషయం అనిపిస్తుంది. పిల్లలకిది జీవన్మరణ సమస్య. ఆ పిల్ల ఎవరు వాణీయా నాకు చచ్చిపోవాలనుంది అని రాసింది చూశావా?

"అసలు ఇది ఒక్క చదువు సమస్య కాదు. ఒక నెగ్లెక్టెడ్‌చైల్డ్, ఒక అవమానానికి గురయిన పిల్ల ఎలా తయారౌతుంది భవిష్యత్తులో. ఈ సంఘటనే చూద్దాం. పిల్లలు తప్పు చేశారు. సరే. శిక్షా అనుభవించారు. చివర్లో టీచర్ల నుంచీ, తోటి పిల్లల నుంచీ వాళ్ల నిస్సహాయతమీద జాలి వర్షం కురిసింది. బహుశా తండ్రి కూడా ఆ రాత్రి ఇద్దర్నీ దగ్గరకు తీసుకుని కళ్లనీళ్లు పెట్టుకుని ఉంటాడు. ఇంతమంది జాలికి పాత్రంకావడం, ఒక అపురూప వస్తువుగా ఆ కాసేపు అందరూ తమని చూడడం, ఆ పిల్లల్ని సులువుగా వదిలిపెట్టకపోవచ్చు. జాలి పొందడంలో ఎంతహాయిఉందో తెలిసింది కాబట్టి పెద్దయ్యాక ఇతరులు జాలిపడేలా ప్రవర్తిం చడం వాళ్ల వ్యక్తిత్వంలో భాగంగా మారినా మారొచ్చు.

"ఈ సంఘటనా, పిల్లలుపడ్డ క్షోభా, అందుకు అసలయిన కారణమూ చూస్తే ఏమని పిస్తుందో తెలుసా? మనం మనుషులకి తగ్గ మంచాలు వెయ్యం. మంచానికి సరిపోయేటట్టు మనుషుల్ని నప్పటానికి ప్రయత్నిస్తూ, సాగదీస్తూ దగ్గరగా నొక్కేస్తూ, వికృతాకారుల్నీ, విపరీత బాధల్నీ సృష్టిస్తున్నాం."